04-10-2023 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - నేను ఒక ఆత్మను, ఇది నా శరీరము అని నిశ్చయం చేసుకోండి, ఇందులో సాక్షాత్కారాలకు సంబంధించిన విషయమేదీ లేదు, ఒకవేళ ఆత్మ సాక్షాత్కారము జరిగినా కూడా ఏమీ అర్థం చేసుకోలేరు"

ప్రశ్న:- తండ్రి యొక్క ఏ శ్రీమతముపై నడవడం ద్వారా గర్భ జైలు శిక్షల నుండి విముక్తులవ్వగలుగుతారు?

జవాబు:- తండ్రి శ్రీమతం ఏమిటంటే - పిల్లలూ, నష్టోమోహులుగా అవ్వండి, ఒక్క తండ్రి తప్ప ఇంకెవ్వరూ లేరు, మీరు కేవలం నన్ను స్మృతి చేయండి మరియు ఏ పాప కర్మలనూ చేయకండి, అప్పుడు గర్భ జైలు శిక్షల నుండి విముక్తులైపోతారు. ఇక్కడ మీరు జన్మజన్మాంతరాలూ జైలు పక్షులుగా అవుతూ వచ్చారు, ఇప్పుడు తండ్రి ఈ శిక్షల నుండి రక్షించేందుకు వచ్చారు. సత్యయుగములో గర్భ జైలు ఉండదు.

ఓం శాంతి. ఆత్మిక తండ్రి ఆత్మిక పిల్లలకు - ఆత్మ ఏమిటి మరియు ఆత్మకు తండ్రి అయిన పరమాత్మ ఎవరు అని అర్థం చేయిస్తారు. ఈ విధంగా మళ్ళీ అర్థం చేయిస్తారు ఎందుకంటే ఇది పతిత ప్రపంచము. పతితులు ఎల్లప్పుడూ వివేకహీనులుగా ఉంటారు. పావన ప్రపంచములో వివేకవంతులు ఉంటారు. భారత్ పావన ప్రపంచముగా అనగా దేవీ-దేవతల రాజ్యముగా ఉండేది, ఈ లక్ష్మీ-నారాయణుల రాజ్యము ఉండేది. వారు చాలా ధనవంతులుగా, సుఖవంతులుగా ఉండేవారు కానీ భారతవాసులు ఈ విషయాలను అర్థం చేసుకోరు. తండ్రి, పరమపిత లేక రచయిత గురించే వారికి తెలియదు. మనుష్యులే తెలుసుకోగలరు, జంతువులైతే తెలుసుకోవు కదా. ఓ పరమపిత పరమాత్మా - అని తలచుకుంటారు కూడా. వారు పారలౌకిక తండ్రి. ఆత్మ తన పరమపిత పరమాత్మను తలచుకుంటుంది. ఈ శరీరానికి జన్మనిచ్చేవారు లౌకిక తండ్రి మరియు ఆ పరమపిత పరమాత్మ పారలౌకిక తండ్రి, ఆత్మల తండ్రి. మనుష్యులు లక్ష్మీ-నారాయణులను పూజిస్తారు, వారు సత్యయుగములో ఉండేవారని మరియు సీతా-రాములు త్రేతాలో ఉండేవారని భావిస్తారు కూడా. తండ్రి వచ్చి అర్థం చేయిస్తారు - పిల్లలూ, మీరు పారలౌకిక తండ్రినైన నన్ను జన్మజన్మాంతరాలూ స్మృతి చేస్తూ వచ్చారు. గాడ్ ఫాదర్ అయితే తప్పకుండా నిరాకారుడే కదా. మన ఆత్మ కూడా నిరాకారియే కదా. ఇక్కడకు వచ్చి సాకారముగా అయ్యింది. ఈ చిన్న విషయము కూడా ఎవరి బుద్ధిలోకి రాదు. వారు మీ అనంతమైన తండ్రి, రచయిత. నీవే తల్లివి-తండ్రివి... మేము మీకు చెందినవారిగా అయినట్లయితే స్వర్గానికి యజమానులుగా అవుతాము, మళ్ళీ మిమ్మల్ని మర్చిపోవడంతో నరకానికి యజమానులుగా అవుతాము అని అంటూ పిలుస్తారు. ఇప్పుడు ఆ తండ్రి వీరి ద్వారా కూర్చొని అర్థం చేయిస్తారు - నేను రచయితను, ఇది నా రచన, దీని రహస్యాన్ని మీకు అర్థం చేయిస్తాను. ఇది కూడా అర్థం చేసుకుంటారు. ఆత్మను ఎవ్వరూ చూడలేదు, మరి నేను ఆత్మను అని ఎందుకంటారు? ఆత్మనైన నేను ఒక శరీరాన్ని వదిలి ఇంకొక శరీరాన్ని తీసుకుంటాను అనైతే అర్థం చేసుకుంటారు కదా. మహాన్ ఆత్మ, పుణ్య ఆత్మ అని అంటారు కదా. నేను ఆత్మను, ఇది నా శరీరము అని నిశ్చయము చేసుకుంటారు. శరీరము వినాశీ, ఆత్మ అవినాశీ. ఆత్మ ఆ పరమపిత పరమాత్ముని సంతానము. ఇది ఎంత సహజమైన విషయము. కానీ మంచి-మంచి వివేకవంతులు అర్థం చేసుకోలేకపోతారు. మాయ బుద్ధికి తాళము వేసేసింది. మీకు మీ ఆత్మ యొక్క సాక్షాత్కారమైతే జరగదు. ఆత్మయే అనేక జన్మలు తీసుకుంటుంది కదా. ప్రతి జన్మలోనూ తండ్రి మారుతూ ఉంటారు. మీరు స్వయాన్ని ఆత్మగా ఎందుకు నిశ్చయం చేసుకోవడం లేదు? ఆత్మ సాక్షాత్కారం జరగాలి అని అంటారు. అరే, ఆత్మ సాక్షాత్కారం జరగాలి అని ఇన్ని జన్మలూ ఎవరితోనైనా అన్నారా? కొందరికి ఆత్మ సాక్షాత్కారం జరుగుతుంది కూడా, కానీ అర్థం చేసుకోలేరు. తండ్రి గురించి మీకు తెలియదు. అనంతమైన తండ్రి తప్ప ఆత్మలకు పరమాత్మ సాక్షాత్కారాన్ని కూడా ఎవరూ చేయించలేరు. ఓ భగవంతుడా అని అంటారు, కావున వారు తండ్రి అయినట్లు కదా. మీకు ఇద్దరు తండ్రులు - ఒకరు వినాశీ శరీరానికి జన్మనిచ్చే వినాశీ తండ్రి, ఇంకొకరు అవినాశీ ఆత్మల అవినాశీ తండ్రి. నీవే తల్లివి-తండ్రివి... అని మీరు గానం చేస్తారు, వారిని స్మృతి చేస్తున్నారంటే తప్పకుండా వారు వచ్చి ఉంటారు కదా. జగదాంబ మరియు జగత్పిత కూర్చొని ఉన్నారు, రాజయోగాన్ని నేర్చుకుంటున్నారు. వైకుంఠములో లక్ష్మీ-నారాయణుల రాజ్యము ఉండేది, వారు కూడా భారత్ లోనే ఉండేవారు కదా. మనుష్యులేమో పైన ఎక్కడో స్వర్గము ఉంటుందని భావిస్తారు. అరే, లక్ష్మీ-నారాయణుల స్మృతి చిహ్నము ఇక్కడ ఉంది, తప్పకుండా వారు ఇక్కడే రాజ్యము చేసి ఉంటారు. ఈ దిల్వాడా మందిరము ఇప్పటి మీ స్మృతిచిహ్నముగా తయారుచేయబడి ఉంది. మీరు రాజయోగులు. అదర్ కుమారులు, కుమారులు, కుమారీలు అందరూ ఇక్కడ కూర్చొని ఉన్నారు, వీరి స్మృతిచిహ్నము మళ్ళీ భక్తిలో తయారవుతుంది. దిల్వాడా అన్న పేరుకు

కూడా ఏదో అర్థం ఉంటుంది కదా. దిల్ ను (హృదయమును) తీసుకునేవారు ఎవరు? ఈ ఆదిదేవ్ మరియు ఆదిదేవి కూడా రాజయోగాన్ని నేర్చుకుంటున్నారు. వీరు కూడా ఆ నిరాకార పరమపిత పరమాత్మను స్మృతి చేస్తారు. వారు ఉన్నతోన్నతులైన జ్ఞానసాగరుడు. ఈ ఆదిదేవుని శరీరములో కూర్చొని పిల్లలందరికీ అర్థం చేయిస్తారు. ఈ మందిరము ఎప్పుడు తయారయ్యింది, ఎందుకు తయారయ్యింది, ఇది ఎవరి స్మృతిచిహ్నము? ఏమీ తెలియదు. దేవీలు మొదలైనవారివి ఎన్ని పేర్లు తీసుకుంటారు. కాళీ, దుర్గ, అన్నపూర్ణ... ఇప్పుడు మొత్తం విశ్వమంతటికీ అన్నపూర్ణ ఎవరవుతారు? ఏ దేవీలు అన్నమును అందిస్తారు, మీకు తెలుసా? భారత్ స్వర్గముగా ఉండేది, అక్కడ అపారమైన వైభవాలు ఉంటాయి, 80-90 సంవత్సరాల క్రితం వరకూ 10-12 అణాలకు ఒక మణుగు ధాన్యం లభించేది, మరి అంతకన్నా ముందు ఎంత చౌకగా ఉండి ఉంటుంది. సత్యయుగములో ధాన్యము మొదలైనవి చాలా చౌకగా, నాణ్యముగా ఉంటాయి. కానీ ఇది కూడా ఎవరూ అర్థం చేసుకోరు. తండ్రి వచ్చి ఆత్మలైన మిమ్మల్ని చదివిస్తారు. ఆత్మ ఈ కర్మేంద్రియాల ద్వారా వింటుంది. ఆత్మకు ఈ కనులు చూసేందుకు లభించాయి, చెవులు వినేందుకు లభించాయి. తండ్రి అంటారు, నిరాకారుడినైన నేను కూడా ఈ శరీరాన్ని ఆధారముగా తీసుకుంటాను. నన్ను సదా శివ అనే అంటారు. మనుష్యులు ఎన్నో పేర్లను పెట్టారు - రుద్రుడు, శివుడు, సోమనాథుడు... కానీ నాకు శివ అన్న ఒక్క పేరే ఉంది. శివాయ నమః అంటూ భక్తులు భగవంతుడిని తలచుకుంటూ వచ్చారు. వారు (భక్తులు) వచ్చి 2,500 సంవత్సరాలు అయ్యింది. భక్తి మార్గములో మొదట అవ్యభిచారి భక్తి ఉండేది. ఇప్పుడైతే మీరు రాయి-రప్పల్లో తోసేసారు. ఇప్పుడు ఇది భక్తి యొక్క అంతిమము. అందరినీ తిరిగి తీసుకువెళ్ళేందుకు నేను వచ్చాను. ఈ పాత ప్రపంచము అంతమవ్వనున్నది. బాంబులు తయారై ఉన్నాయి కావున ఎంత కొద్ది సమయంలో అందరూ అంతమైపోతారు. సత్యయుగములో ఎంత తక్కువమంది అనగా కేవలం 9 లక్షల మందే ఉంటారు. మిగిలినవారంతా ఎక్కడికి వెళ్తారు? యుద్ధాలు, భూకంపాలు మొదలైనవి జరుగుతాయి. వినాశనమైతే తప్పకుండా జరగాలి.

వీరు ప్రజాపిత, ఎంతమంది బ్రహ్మాకుమార-కుమారీలు ఉన్నారు. బ్రహ్మాకు తండ్రి ఎవరు? నిరాకార శివుడు. మనము వారి మనుమలము-మనుమరాళ్ళము. శివబాబా నుండి మనం వారసత్వాన్ని తీసుకుంటాము. కావున వారినే స్మృతి చేయాలి. స్మృతి ద్వారానే పాపాల భారము తొలగిపోతుంది. ఇది వికారీ, పతిత ప్రపంచమని మీకు తెలుసు. సత్యయుగము నిర్వికారీ ప్రపంచము. అక్కడ విషము (వికారాలు) ఉండదు. నియమానుసారముగా ఒక్కడే కొడుకు ఉంటాడు. ఎప్పుడూ అకాల మృత్యువులు జరగవు. అది ఉన్నదే సుఖధామము. ఇక్కడైతే ఎంత దుఃఖము ఉంది. కానీ ఈ విషయాల గురించి ఎవ్వరికీ తెలియదు. గీతను వినిపిస్తారు. శ్రీమత్ భగవద్గీత, భగవానువాచ. అచ్ఛా, భగవంతుడు ఎవరు? శ్రీకృష్ణుడు అని అంటారు. అరే, అతడైతే చిన్న పిల్లవాడు, అతడు ఎలా రాజయోగాన్ని నేర్పించగలడు? ఆ సమయంలో పతిత ప్రపంచము ఉందా. సద్గతి కొరకు రాజయోగాన్ని నేర్పించేవారైతే ఇక్కడే కావాలి. గీతలో - రుద్ర గీతా జ్ఞాన యజ్ఞము అని వ్రాయబడి ఉంది కూడా. శ్రీకృష్ణ గీతా జ్ఞాన యజ్ఞము అని లేదు. ఈ జ్ఞాన యజ్ఞము ఎన్ని సంవత్సరాలుగా కొనసాగుతూ వస్తోంది, దీని సమాప్తి ఎప్పుడు జరుగుతుంది? ఎప్పుడైతే మొత్తం సృష్టి అంతా ఇందులో స్వాహా అవుతుందో అప్పుడు. యజ్ఞము ఎప్పుడైతే సమాప్తమవుతుందో అప్పుడు అందులో అంతా స్వాహా చేస్తారు కదా. ఈ యజ్ఞము కూడా అంతిమం వరకూ కొనసాగుతూ ఉంటుంది. ఈ పాత ప్రపంచము సమాప్తమవ్వనున్నది. తండ్రి అంటారు, నేను కాలుడికే కాలుడిని, అందరినీ తీసుకువెళ్ళేందుకు వచ్చాను. మీరు స్వర్గానికి అధిపతులుగా అవ్వాలని మిమ్మల్ని చదివిస్తున్నాను. ఈ సమయంలో మనుష్యమాత్రులందరూ సదా దుర్భాగ్యశాలురుగా ఉన్నారని, సత్యయుగములో సదా సౌభాగ్యశాలురుగా ఉండేవారని మీకు తెలుసు - ఈ వ్యత్యాసాన్ని అందరికీ అర్థం చేయించాలి. ఇక్కడకు వచ్చినప్పుడు బాగా అర్థం చేసుకుంటారు, మళ్ళీ ఇంటికి వెళ్ళడంతో అంతా సమాప్తమైపోతుంది. ఏ విధంగానైతే గర్భ జైలులో - మేము పాపాలు చేయము అని ప్రతిజ్ఞ చేసి వస్తారు. బయటకు రావడంతో మళ్ళీ పాపాలు చేయడం మొదలుపెడతారు. జైలు పక్షులు వలె ఉంటారు కదా. ఈ సమయంలో మనుష్యమాత్రులెవరైతే ఉన్నారో వారంతా జైలు పక్షులు. ఘడియ-ఘడియ గర్భ జైలులోకి వెళ్ళి శిక్షలు అనుభవిస్తారు. తండ్రి అంటారు, ఇప్పుడు మిమ్మల్ని గర్భ జైలు పక్షులుగా అవ్వడం నుండి విడిపిస్తాను. సత్యయుగంలో గర్భాన్ని జైలు అని అనరు. మిమ్మల్ని ఈ శిక్షల నుండి రక్షించేందుకు వచ్చాను. ఇప్పుడు నన్ను స్మృతి చేయండి, ఏ పాపాలూ చేయకండి, నష్టోమోహులుగా అవ్వండి. నాకు ఒక్కరు తప్ప ఇంకెవ్వరూ లేరు అని గానం చేస్తారు... ఇది శ్రీకృష్ణుని విషయమేమీ కాదు. శ్రీకృష్ణుడైతే 84 జన్మలు తీసుకొని ఇప్పుడు బ్రహ్మాగా అయ్యారు, మళ్ళీ అతనే శ్రీకృష్ణునిగా అవుతారు, కావుననే ఈ శరీరములోకే ప్రవేశించారు. ఇది తయారై-తయారుచేయబడిన డ్రామా. ఇప్పుడు భగవంతుడు ఈ సూర్యవంశీ, చంద్రవంశీ రాజధానులను స్థాపన చేస్తున్నారు. మీ భవిష్యత్తు కొరకు ప్రారబ్ధాన్ని తయారుచేస్తారు. ఇప్పుడు మీరు పురుషార్థము చేసి అనంతమైన తండ్రి ద్వారా అనేక జన్మల ప్రారబ్ధాన్ని

తయారుచేసుకుంటున్నారు, ఆ తండ్రి స్వర్గ రచయిత. ఈ విషయాలు అర్థం చేసుకోవాల్సినవి. డ్రామాలో ప్రతి పాత్రధారికి తమ-తమ పాత్ర ఉంది. ఇందులో మనం ఎందుకు ఏడవాలి? మనం జీవిస్తూనే ఆ ఒక్క తండ్రిని స్మృతి చేస్తాము. మనకు ఈ శరీరము యొక్క చింత కూడా లేదు. ఈ పాత శరీరము పోతే మనము బాబా వద్దకు వెళ్ళిపోతాము. ఈ సమయంలో మీరు భారత్ కు ఎంతటి సేవను చేస్తారు. అన్నపూర్ణ, దుర్గ, కాళి మొదలైనవి మీ పేర్లుగానే గాయనం చేయబడతాయి. అంతేకానీ కాళీ అంటే ఎవరో భయంకరమైన ముఖము కలవారన్నట్లు లేక వినాయకుడు అంటే తొండము కలవారన్నట్లు ఎవరూ ఉండరు. మనుష్యులు మనుష్యులుగానే ఉంటారు. ఇప్పుడు తండ్రి అర్థం చేయిస్తారు, నేను పిల్లలైన మిమ్మల్ని ఈ లక్ష్మీ-నారాయణుల వలె తయారుచేస్తున్నాను. మేము బాబా నుండి వారసత్వాన్ని తీసుకుంటున్నాము, మళ్ళీ భవిష్యత్తులో వెళ్ళి యువరాజు-యువరాణులుగా అవుతాము అని మీరు నిశ్చయం చేసుకోండి. ఏ తండ్రి అయితే స్వర్గ రచయితనో, వారి గురించి ఎవ్వరికీ తెలియదు. జగదాంబను కూడా మర్చిపోయారు. ఎవరి మందిరమైతే తయారుచేయబడి ఉందో - వారు ఇప్పుడు చైతన్యముగా కూర్చొని ఉన్నారు. కలియుగము తర్వాత మళ్ళీ సత్యయుగము రానున్నది. వినాశనము గురించి మనుష్యులు అడుగుతారు. అరే, మొదట మీరు చదువుకొని వివేకవంతులుగా అయితే అవ్వండి. మహాభారత యుద్ధమైతే తప్పకుండా జరిగింది, ఆ తర్వాతనే స్వర్గ ద్వారాలు తెరుచుకున్నాయి. కావున ఇప్పుడు ఈ మాతల ద్వారా స్వర్గ ద్వారాలు తెరుచుకుంటున్నాయి. వందేమాతరం అని గానం చేస్తారు కదా. పావనులకే వందనం చేయడం జరుగుతుంది. మాతలు రెండు రకాలుగా ఉన్నారు - ఒకరు దైహిక సమాజ సేవకులు, ఇంకొకరు ఆత్మిక సమాజ సేవకులు. ఇది మీ ఆత్మిక యాత్ర. మేము ఈ శరీరాన్ని వదిలి తిరిగి వెళ్ళనున్నామని మీకు తెలుసు. భగవానువాచ - మన్మనాభవ. తండ్రినైన నన్ను స్మృతి చేయండి. చిన్న పిల్లవాడైన శ్రీకృష్ణుడైతే ఈ విధంగా అనరు కదా. అతనికైతే తన తండ్రి ఉన్నారు. మన్మనాభవ యొక్క అర్థము గురించి ఎవ్వరికీ తెలియదు. తండ్రి అంటారు, నన్ను స్మృతి చేసినట్లయితే వికర్మలు వినాశనమవుతాయి మరియు ఎగిరేందుకు రెక్కలు లభిస్తాయి. ఇప్పుడు మీరు రాతిబుద్ధి నుండి పారసబుద్ధి కలవారిగా అవుతారు. రచయిత అయిన తండ్రి అయితే అందరికీ ఒక్కరే. ఆదిదేవ్ మరియు ఆదిదేవీల మందిరాలు కూడా ఉన్నాయి. వారి పిల్లలైన మీరు ఇక్కడ రాజయోగాన్ని నేర్చుకుంటున్నారు. ఇక్కడే మీరు తపస్య చేసారు, మీ స్మృతిచిహ్నము ఎదురుగా నిలిచి ఉంది. లక్ష్మీ-నారాయణులు మొదలైనవారికి రాజ్యం ఎలా లభించింది, ఇది వారి మందిరము. మీరు రాజఋషులు. రాజ్యాన్ని ప్రాప్తి చేసుకునేందుకు లేక భారత్ కు మళ్ళీ రాజ్య భాగ్యాన్ని ప్రాప్తింపజేసేందుకు మీరు పురుషార్థము చేస్తున్నారు. మీరు మీ తనువు, మనస్సు, ధనముల ద్వారా సేవ చేసి భారత్ లో స్వర్గ రాజ్యాన్ని స్థాపన చేస్తారు. తండ్రి యొక్క శ్రీమతము ద్వారా మీరు పతిత రావణ రాజ్యము నుండి అందరినీ విముక్తులుగా చేస్తారు. తండ్రి ముక్తిప్రదాత, దుఃఖహర్త, సుఖకర్త. మీ దుఃఖాలను హరించేందుకు పాత ప్రపంచాన్ని వినాశనం చేయిస్తారు. మీకు శత్రువుపై విజయాన్ని ప్రాప్తింపజేస్తారు, తద్వారా మీరు మాయాజీత్-జగత్ జీతులుగా అవుతారు. మీరు కల్ప-కల్పమూ రాజ్యాన్ని తీసుకుంటారు, మళ్ళీ పోగొట్టుకుంటారు. ఇది రుద్రుడైన శివుని యొక్క జ్ఞాన యజ్ఞము, దీని ద్వారా ఈ వినాశ జ్వాల వెలువడింది. వారంతా వినాశనమైపోతారు మరియు మీరు సదా సుఖవంతులుగా అవుతారు. దుఃఖము ద్వాపరము నుండి ప్రారంభమవుతుంది. తండ్రి అంటారు, నేను వచ్చి నరకవాసులను స్వర్గవాసులుగా తయారుచేస్తాను. కలియుగము వేశ్యాలయము, సత్యయుగము శివాలయము. మీరు అనంతమైన తండ్రి ద్వారా స్వర్గాధిపతులుగా అవుతారు కావున ఈ సంతోషపు పాదరసము పైకి ఎక్కాలి. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. జీవిస్తూనే తండ్రిని స్మృతి చేసి వారసత్వపు అధికారాన్ని తీసుకోవాలి, ఏ విషయము గురించి లెక్కచేయకూడదు.

2. శ్రీమతముపై మీ తనువు, మనస్సు, ధనముల ద్వారా భారత్ ను స్వర్గముగా తయారుచేసే సేవను చేయాలి మరియు అందరికీ రావణుడి నుండి విముక్తులుగా అయ్యే యుక్తిని తెలియజేయాలి.

వరదానము:- యోగ జ్వాల ద్వారా విశ్వములోని చెత్తను భస్మం చేసే విశ్వపరివర్తక భవ

యోగ జ్వాల అనగా శ్రేష్ఠ సంకల్పాల శక్తి లేక లగనమనే అగ్ని ద్వారానే అపవిత్రత రూపీ చెత్తను భస్మం చేయగలరు. ఏ విధంగా దేవీల స్మృతిచిహ్నములో - జ్వాల ద్వారా అసురీ శక్తులను అంతం చేసినట్లుగా

చూపిస్తారు, ఆ స్మృతిచిహ్నము ఇప్పటిదే. కావున మొదట జ్వాలా రూపంగా అయి అసురీ సంస్కారాలను, స్వభావాలను మొదలైనవాటన్నింటినీ భస్మం చేసి సంపూర్ణ పావనంగా అవ్వండి, అప్పుడు యోగము మరియు పవిత్రత అనే జ్వాల ద్వారా విశ్వంలోని చెత్తను భస్మం చేసి విశ్వపరివర్తనకు నిమిత్తులుగా అవుతారు.

స్లోగన్:- ఎవరైతే మన్మతము, పరమతము నుండి ముక్తులుగా ఉంటూ సదా శ్రీమతంపై నడుస్తారో వారే ఆజ్ఞాకారులు.